సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయ ఆవరణలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కఠారి రంగరాజు (రావులపాలెం) రూ.1,05,116 విరాళం అందించారు.




వంటింట్లో ధరల మంట

పెరుగుతున్న ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యావసరాలు, కూరలు.. ఇలా ప్రతి వస్తువు ధర కొండెక్కి కూర్చుంది. దీంతో పేదల బడ్జెట్ గందరగోళానికి గురవుతోంది.

8లో

1.62 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 13,700 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

నియామక ఉత్తర్వుల జారీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన, బదిలీ అయిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు, సీనియర్ అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులు మంగళవారం కలెక్టర్ ప్రశాంతి జారీ చేశారు. ఐదుగురు తహసీల్దార్లు, 38 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 26 మంది సీనియర్ అసిస్టెంట్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐల బదిలీల నేపథ్యంలో నియామక ఉత్తర్వులు ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి సీహెచ్ విద్యావతిని కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక తహసీల్దార్‌గా నియమించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావును రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్‌గా నియమించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నుంచి ఎం.దుర్గాప్రసాద్‌ను కొవ్వూరు తహసీల్దార్‌గా నియమించారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనా అధికారి పీహెచ్‌జీఆర్ పాపారావును రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్‌గా నియమించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎండీ మక్సూద్ అలీని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా నియమించారు. వీరితో పాటుగా 38 మంది డిప్యూటీ తహసీల్దార్లను, 26 మంది సీనియర్ అసిస్టెంట్‌లను వివిధ విభాగాలలో నియమించారు.

ఇన్‌చార్జి డీపీఓగా నాగలత

రాజమహేంద్రవరం రూరల్: ఇన్‌చార్జి జిల్లా పంచాయతీ అధికారిగా రాజమహేంద్రవరం డీఎల్‌పీఓ ఎం.నాగలతను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నియమించారు. జిల్లా పంచాయతీ అధికారిగా విశాఖ జిల్లా ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావును నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటివరకూ జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసిన డి.రాంబాబు సోమవారం రాత్రి రిలీవ్ అవ్వడంతో డీఎల్‌పీఓ నాగలతను ఇన్‌చార్జిగా నియమించారు.

ప్రజాప్రతినిధులు బాధ్యత విస్మరించడం తగదు

- పంతంకు కన్నబాబు సూచన




వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజాప్రతినిధులు తమకు ప్రజలిచ్చిన గురుతర బాధ్యతను విస్మరించి అప్రజాస్వామికమైన భాష ఉపయోగించి దురుసుగా ప్రవర్తించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరూ హర్షించరని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు రోల్‌మోడల్‌గా నిలవాలే తప్ప ఇటువంటి సంఘటనలకు కారకులు కాకూడదని చెప్పారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైద్యుడు, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ పి.ఉమామహేశ్వరరావుపై రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేసిన ఘటనపై మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఏ చిన్న ఘటనలో అయినా ప్రజాప్రతినిధులు సంయమనంతో వ్యవహరించాలన్నారు. అలా కాకుండా ఆవేశకావేశాలకు పోతే ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతాయనే విషయాన్ని మరచిపోకూడదని కన్నబాబు హితవు పలికారు.

మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా?

నానాజీ, అనుచరులు వైద్యుడిని చంపేస్తామని బెదిరించడం, అవమానించడం, దాడి చేయడం చూస్తుంటే అసలు మనం ఎక్కడున్నాం. ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందన్నారు. వేలాది మంది నిష్ణాతులైన వైద్యులను సమాజానికి అందించిన రంగరాయ వైద్యకళాశాలలో ఇటువంటి ఉదంతాలు దురదృష్టకరమన్నారు. మెడికోలు ఆడుకునే వాలీబాల్ కోర్టులో అనుమతి లేకుండా బయట వ్యక్తులు అడుగుపెట్టడమే పెద్ద తప్పన్నారు. దీనిని ఖండించి అనుచరులను హెచ్చరించి ఇటువంటి వాటిలో జోక్యం చేసుకోవద్దని చెప్పాల్సిన ఎమ్మెల్యే తన హోదాను మరిచి వైద్యుడిపై దౌర్జన్యపూరితంగా ప్రవర్తించడం మంచిది కాదని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు నలుగురికీ ఆదర్శంగా నిలవాలే తప్ప దూకుడుగా వ్యవహరించడం సహేతుకం కాదని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లపై ఉందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



వినయ్‌బాబుకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హనుమకొండకు చెందిన కాజా వెంకట వినయ్ బాబు, కుటుంబ సభ్యులు మంగళవారం రూ.10,116, అలాగే ఏలూరుకు చెందిన చింతం సరోజ, నాగేశ్వరరావు దంపతులు రూ.10,001 విరాళం అందజేశారు. ఆలయ అధికారులు దాతలను సత్కరించి ప్రసాదం అందజేశారు.

సర్దుపోటు

- పిల్లల విద్యాభ్యాసానికి తూట్లు
- 35 మందికి ఆరుగురు ఉపాధ్యాయుల ఎంపిక
- పరిష్కారం కాని సబ్జెక్టు టీచర్ల కొరత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఉన్నత భవిష్యత్తును పొందాలనే ఆశ ఇక అడియాసగానే మిగిలిపోనుంది. విద్యార్థులు తరగతిలో సబ్జెక్టులన్నీ పూర్తిగా అభ్యసించే దిశగా చేపట్టిన సర్దుబాటు ప్రక్రియకు తూట్లు పడ్డాయి. పిల్లలు లేనిచోట అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, పిల్లలు అధికంగా ఉన్నచోట ఒకే ఉపాధ్యాయుడితో సర్దుబాటు జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన సర్దుబాటు ప్రక్రియలో మొత్తం ఇదే తంతు. రాజమహేంద్రవరంలోని వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలో 1, 2 తరగతులను 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి ఏకంగా ఆరు గురు ఉపాధ్యాయులు ఉన్నారు. వందల సంఖ్యలో ఉన్న లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్ నుంచి సర్దుబాటు ప్రక్రియల ఏడుగురు వెళ్లగా, ముగ్గురు వచ్చారు. ప్రైమరీలో 60 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులను వేశారు. ఈ సంఖ్యకు ముగ్గురు ఉపాధ్యాయులే ఉండాలి. నెహ్రూనగర్ ఎలిమెంటరీ స్కూలులో 33 మంది పిల్లలు ఉండగా ఆరుగురు ఉపాధ్యాయులున్నారు. ఇక హైస్కూలులో అయితే తెలుగు, సోషల్ ఉపాధ్యాయులే లేరు. ఇలా సబ్జెక్టు టీచర్లు ఉమ్మడి జిల్లాలో చాలా స్కూళ్లలో లేరు. నన్నయ మున్సిపల్ హైస్కూలులో కొత్తగా జూనియర్ కళాశాల ప్రారంభించి పోస్టులు మంజూరు చేయలేదు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రారంభించారు. వీటిని హైస్కూలు ఉపాధ్యాయులతో నామమాత్రంగా బోధిస్తున్నారు. డీఎంహెచ్ స్కూలు ఉపాధ్యాయులు చాలామంది మెడికల్ లీవ్‌లో ఉన్నారు. వారి స్థానంలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేదు. మూడు నెలలు దాటి మెడికల్ లీవు ఉంటే సర్దుబాటు ప్రక్రియ నిబంధనల ప్రకారం కొత్త టీచర్‌ను భర్తీ చేయాలి. అదెక్కడా జరగలేదు. నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియకు మేనేజ్‌మెంట్‌ల వారీగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సి వుంది. దీన్ని పూర్తిగా విస్మరించి సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులంతా గుర్రుగా ఉన్నారు. సర్దుబాటు ప్రక్రియ జరిగిన వెంటనే ఆ ఉపాధ్యాయుడు సంబంధిత స్కూలులో చేరాలి. కొంతమంది నిరాశతో చేరలేదు. అయినా వారిపై చర్యలు శూన్యం. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జీవో నంబర్ 117ను రద్దు చేస్తామని నారా లోకేష్ ఉపాధ్యాయులందరికీ హామీ ఇచ్చారు. ఆ హామీ అమలుకు నోచుకోలేదు. మెగా డీఎస్సీని మరపించేందుకే ఈ ఎత్తుగడలన్నీ అని అందరికీ తేటతెల్లమైంది. తూర్పు గోదావరి జిల్లాలో స్కూలు అసిస్టెంట్లు 92, ఎస్జీటీలు 174, మొత్తం 266 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు జరిగింది.



35 మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులను భర్తీ చేసిన వీరభద్రపురం ప్రాథమిక పాఠశాల



వీరభద్రపురం పాఠశాలలో తరగతి గదిలో తక్కువగా ఉన్న విద్యార్థులు

ప్రభుత్వ ఆదేశాలు రాగానే మార్పులు చేస్తాం



సర్దుబాటు ప్రక్రియలో తక్కువ మంది పిల్లలు ఉన్నచోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారనేది వాస్తవమే. అయితే నిబంధనలకు అనుగుణంగా సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేశాం. పిల్లల సంఖ్యకు, ఉపాధ్యాయులకు వ్యత్యాసం ఉన్న స్కూళ్లలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సర్దుబాటు రెండో విడతలో సమస్యను అధిగమిస్తాం. హైస్కూలు ప్లస్‌లో కోర్సు అధ్యాపకుల భర్తీ త్వరలోనే జరుగుతుంది.

–కె.వాసుదేవరావు,
జిల్లా విద్యాశాఖాధికారి, తూర్పుగోదావరి జిల్లా

కుట్రతోనే తిరుపతి లడ్డూపై చంద్రబాబు ఆరోపణ

- సిట్‌తో విచారణ వద్దు
- జగన్ కోరినట్టు సీబీఐ విచారణ నిర్వహించాలి
- మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ: పవిత్ర తిరుమల లడ్డూ విషయంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో కుట్రతోనే ఆరోపణ చేశారని లడ్డూ కల్తీ జరిగిందనేందుకు ఆయన వద్ద ఏ ఆధారాలు లేవని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగింది అని నిరూపించడం ప్రధాన మంత్రి నుంచి ముఖ్యమంత్రి వరకూ ఎవరికీ సాధ్యం కాదన్నారు. చంద్రబాబు నియమించే సిట్‌తో విచారణ వద్దన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కోరినట్టు సీబీఐతో విచారణ నిర్వహించాలన్నారు. లడ్డూ విషయంలో హిందువులు రోడ్లపైకి రావాలని డిప్యూటీ సీఎం హోదాలో పవన్‌కల్యాణ్ రెచ్చగొట్టడం సరైన విధానం కాదన్నారు. ప్రభుత్వంలో ఉంటూ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న పవన్ కల్యాణ్‌ను డిప్యూటీ సీఎంగా తక్షణమే డిస్మిస్ చేయాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు. పవన్ చంద్రబాబుకు భజన చేయడం మానుకోవాలన్నారు. చంద్రబాబు పాలన చేపట్టి 100 రోజులైనా చిన్నిచిన్న పనులను సైతం చేయలేకపోయారన్నారు.

తిరుమల లడ్డూ వివాదంపై
సీబీఐ విచారణ జరపాలి

కాంగ్రెస్ నిరసన దీక్షలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు



నిరసన దీక్ష సందర్భంగా విలేకరులతో మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ: ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవమైన తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై ఏర్పడిన వివాదంపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సీబీఐతో విచారణ జరిపించాలని సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టీ.కే. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది శ్రీవారి భక్తులలో ఆందోళన నెలకొందన్నారు. ఈ వివాదంలో నిజాలు నిగ్గు తేల్చేందుకు కూటమి ప్రభుత్వం వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. శ్రీవారిని కూడా రాజకీయాల్లోకి లాగడం సరికాదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ నిలుపుదల వంటి సమస్యలతో పాటు సంక్షేమం, అభివృద్ధిపై ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టడం లేదన్నారు. 2014 నుండి 2024 వరకు అనుమతించిన ప్రత్యేక దర్శనాలపై కూడా విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ సభ్యుడు బోడా వెంకట్, పీసీసీ కార్యదర్శులు బెజవాడ రంగా, అబ్దుల్లా షరీఫ్, దేవత సుధాకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా శారద పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు



విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజా

కొవ్వూరు: ప్రజల నడ్డి విరుస్తున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు బాసటగా నిలవడమే లక్ష్యంగా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మళ్లీ జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. తలారి వెంకట్రావు పార్టీకి అంకిత భావంతో పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు.

ఏ కష్టం వచ్చిన మీపక్షాన నిలబడతాం : జక్కంపూడి రాజా

రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలు కైవసం చేసు కుని పార్టీకి పూర్వవైభం తీసుకొచ్చేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అడ్రస్ లేకుండా చేసిందన్నారు. ఈ విషయాన్ని దారిమళ్లించేందుకు కూలల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. వందరోజుల పాలనలో కూటమికి ఓట్లు వేయని వారిపై కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమే లక్ష్యంగా పనిచేసిందని విమర్శించారు. ఏ చిన్న కష్టం వచ్చినా క్షణాల్లో మీ పక్షాన మేమంతా నిలబడతామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ నెల 28న రాజమహేంద్రవరం ఆనంద రీజెన్సీ పందిరిహాలు వేదికలో మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా నూతన అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరిస్తున్నారని అన్నారు. నియోకజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనర్ధన రావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఈ-బైక్... ఇక బ్యాక్

- కూటమి సర్కార్ పన్ను పోటు
- ప్రతి వాహనంపై రూ.12 వేల భారం
- గత ప్రభుత్వంలో మినహాయింపు
- ఇప్పుడు కానరాని రాయితీలు

పర్యావరణ కాలుష్యం పడగ విప్పింది.. అంతకంతకూ కోరలు చాస్తోంది.. దీనికి వాహన కాలుష్యమే ప్రధాన కారణం. అందుకే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎలక్ట్రిక్ బైక్‌లకు పన్ను మినహాయించి పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేసింది.. ఇప్పటి ప్రభుత్వం ధనార్జనే ధ్యేయంగా సాగుతోంది. పర్యావరణాన్ని పక్కనబెట్టి ఈ-బైక్‌లపైనా పన్నులు విధిస్తూ వినియోగదారులపై భారం మోపడమే కాకుండా పర్యావరణ విఘాతానికి కారణమవుతోంది. కూటమి ప్రభుత్వం తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల ట్యాక్స్, కొనుగోలు ఇలా..

షోరూమ్‌లు : 12
జూలై 7 తర్వాత ట్యాక్స్ : 12 శాతం
జూలై 7కు ముందు ఎలక్ట్రానిక్ వాహనాల అమ్మకాలు : 250 (నెలకు)
జూలై 7 తర్వాత ఎలక్ట్రానిక్ వాహనాల అమ్మకాలు : 110 (నెలకు)

సాక్షి, ప్రతినిధి, కాకినాడ: వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ-బైక్‌లను ప్రోత్సహించింది. వీటిని కొనుగోలు చేసే వినియోగదారులకు పన్నుల్లో రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలు అందించింది. ఈ బైక్‌లు కొనుగోలు చేసే ప్రతి వాహనదారుడికి సుమారు రూ.12 వేల లబ్ధి చేకూర్చే నిర్ణయాన్ని తీసుకుంది. ఈ మేరకు రవాణా శాఖకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అప్పటి ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాలతో అన్ని వర్గాల ప్రజలు ఈ బైక్‌ల కొనుగోలుకు ముందుకు వచ్చారు. జిల్లాలో ఈ-బైక్‌ల షోరూమ్‌లూ భారీగా వెలశాయి. వాహనాల కొనుగోలు కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రావడంతోనే ఈ-బైక్‌ల కొనుగోలుదారులపై పెనుభారం మోపింది. గడువు తీరిన రాయితీని పునరుద్ధరించక పోవడంతో సమస్య ఉత్పన్నమైంది. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలును గాలికొదిలేసి, లేని ఆదాయం కోసం వెంపర్లాడుతూ ప్రజలపై పన్నుల భారం మోపడాన్ని అంతా తప్పుపడుతున్నారు. ప్రధానంగా యువత సామాజిక బాధ్యతతో కాలుష్య రహిత వాహనాల వైపు దృష్టి పెడితే సర్కార్ మాత్రం వారి నడ్డి విరిచే ఆదేశాలు ఇచ్చింది. చంద్రబాబు కూటమి సర్కారు ఇలా వచ్చిందో లేదో ఈ బైక్‌లపై ఉన్న పన్ను రాయితీ ప్రక్రియకు మంగళం పాడిందని యువత మండిపడుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై గత జూలై 7 నుంచి 12 శాతం పన్ను వసూలుకు శ్రీకారం చుట్టింది. యువతతో పాటు మహిళలు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్ల వైపు దృష్టి మరలిస్తోన్న తరుణంలో ప్రభుత్వం పన్ను విధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పడిపోయిన కొనుగోళ్లు

గత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగదారుల కోసం పన్ను రహిత కొనుగోళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని రవాణా శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ-బైక్‌లు కొనుగోలు చేసిన వినియోగదారులకు సుమారు రూ.12 వేల మినహాయింపు ఇప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం గత జూలై 7 నుంచి సున్నా పన్ను విధానాన్ని ఎత్తేసింది. ఫలితంగా ఈ-బైక్‌ల కొనుగోళ్లు అకస్మాత్తుగా పడిపోయాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 12 ఎలక్ట్రికల్ టూ వీలర్స్ షోరూమ్స్ ఉన్నాయి. కాకినాడ నగరంలో 5, రూరల్‌లో 3, పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం, తుని ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున షోరూమ్‌లు ఏర్పాటు చేశారు. ఈ షోరూమ్‌లలో గత ప్రభుత్వంలో పన్ను లేనప్పుడు ప్రతి నెలా 200 నుంచి 300 వరకు వాహనాల అమ్మకాలు జరుగుతుండేవి. గత జూన్ నెలతో పన్ను మినహాయింపు జీఓ గడువు ముగిసింది. ఆదాయం కోసం ఆలోచించడమే తప్ప సామాజిక బాధ్యత లేనట్టుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని యువత ఆక్షేపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతి ఈ బైక్ కొనుగోలుపై 12 శాతం, నాలుగు చక్రాల వాహనానికైతే 14 నుంచి 18 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఈ పన్ను భారం భరించలేక ఈ-బైక్‌ల కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. పన్ను భారం పడడంతో అమ్మకాలు సగానికి పడిపోయాయి. ప్రస్తుతం నెలకు 100 నుంచి 150 వాహనాలు అమ్ముడైతే గొప్ప అని షోరూమ్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఏకపక్షంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై పన్నుల భారం మోపడాన్ని ప్రజలు దుయ్యబడుతున్నారు. ట్యాక్స్ విధించడంతో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలన్న వారిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రూ.12 వేల నుంచి రూ.14 వేల పన్ను భారం మోపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాహన కాలుష్యం తగ్గించి వాతావరణ సమతుల్యతను పరిరక్షించే సంకల్పంతో గత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై పన్ను సడలించింది. ఇదే విధానాన్ని పునరుద్ధరించి వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



ఈ-బైక్‌లు

పన్ను భారం సరికాదు



ఈ-బైక్‌లపై పన్నుల భారాన్ని మోపడంతో అదనంగా రూ.12 వే లు చెల్లించాల్సి వచ్చింది. పన్నులు లేవని చెప్పడంతో ఈ-బైక్ కొ నుగోలు చేద్దామని షోరూమ్‌కు వెళితే రూ.లక్ష సిద్ధం చేసుకుంటే సరిపోతుందని షో రూమ్ నిర్వాహకులు చెప్పారు. సరే అని అంత నగదు సిద్ధం చేసుకున్నాను. నెల తి రగకుండానే పన్నుల భారం మోపడంతో అదనంగా సొమ్ము చెల్లించాల్సి వచ్చింది.

– సలాది సుబ్బారావు,
ఈ-బైక్ కొనుగోలుదారు, కాకినాడ

అమ్మకాలు తగ్గాయి



ఇటీవల కాలంలో ఈ-బైక్‌ల అమ్మకాలు తగ్గాయి. వాహన కాలుష్యం తగ్గించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో కొన్ని రాయితీలు ప్రకటించింది. ఇది తక్షణం అమలులోకి వస్తే ఈ-బైక్‌ల అమ్మకాలు పెరుగుతాయి. గతంలో మా షోరూమ్‌లో నెలకు 10 వాహనాల విక్రయాలు జరిగేవి. ప్రస్తుతం ఐదు వాహనాల కొనుగోళ్లు మాత్రమే జరుగుతున్నాయి.

– కంతేటి చిన్నా,
ఓ షోరూమ్ నిర్వాహకుడు, జగన్నాథపురం

క్లుప్తంగా

29న బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2-1-2005 తర్వాత పుట్టిన బాల బాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు తీసుకుని హాజరు కావాలని, విధిగా డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. ఎంపికైన వారు వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకూ విశాఖ జిల్లా నునపర్తిలో జరిగే అంతర్ జిల్లాల పోటీలలో పాల్గొంటారన్నారు.

'నన్నయ'లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ సెలెక్షన్స్



సెలక్షన్స్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ సెలక్షన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి 155 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు హాజరయ్యారు. యూత్ అఫైర్స్, క్రీడా మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సెలక్షన్లను ప్రారంభించిన అనంతరం ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు వర్సిటీ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ చేరడం వల్ల విద్యార్థులలో సేవా దృక్పథం, క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజంపై సేవాభావం అలవడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, పీఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

వంటింట్లో ధరల మంట

- నిత్యావసరాల ధరలు పైపైకి
- రికార్డు స్థాయిలో బియ్యం, నూనెల రేట్లు
- స్పందించని ప్రభుత్వం
- నియంత్రణ చర్యలు శూన్యం



అలమూరు/అమలాపురం రూరల్: ప్రజల జీవన విధానం సక్రమంగా సాగాలంటే మార్కెట్‌లో ధరలు అనుకూలంగా ఉండాలి. వారు సంపాదించే ఆదాయానికి అనుగుణంగా నిత్యావసరాలు, ఇతర వస్తువుల ధరలు ఉన్నప్పుడే ప్రశాంతంగా జీవించగలుతారు. కానీ నేడు పరిస్థితి లేదు. విపరీతంగా పెరుగుతున్న ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యావసరాలు, కూరలు.. ఇలా ప్రతి వస్తువు ధర కొండెక్కి కూర్చుంది. దీంతో పేదల ఆర్థిక బడ్జెట్ గందరగోళానికి గురవుతోంది. దాదాపు 30 శాతం అదనపు భారం పడుతోంది. ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

ఏమీ కొనలేం..

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు, కూరగాయల ధరలు భారీగా పెరిగిపోవడంతో జిల్లాలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఏమీ కొనలేని, ఏమీ తినలేని స్థితిలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన సుంకాల ప్రభావంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటనూనె ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. రైసుమిల్లర్ల వ్యాపార కార్యకలాపాలపై నియంత్రణ లేకపోవడంతో ఇటీవల క్వింటాల్ సన్న బియ్యాన్ని బ్రాండ్‌ను బట్టి మిల్లర్లు ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సోనామసూరి, హెచ్ఎంటీ వంటి సన్నరకాల ధాన్యాన్ని రైసుమిల్లర్ నాణ్యతను బట్టి క్వింటాల్ రూ.2,500 నుంచి రూ.3 వేల వరకూ కొనుగోలు చేస్తున్నారు. మిల్లింగ్ చేయగా వచ్చిన బియ్యాన్ని మిల్లర్లు మార్కెట్‌లో క్వింటాల్ రూ.7,200 వరకూ విక్రయిస్తున్నారు.

తగ్గిన దిగుమతులు

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు నాశనమయ్యాయి. మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతులు తీవ్రంగా తగ్గిపోయాయి. దీంతో నెల రోజులుగా ఉల్లి ధర రూ.60 పైనే పలుకుతోంది. దీనికి తోడు అన్ని కూరగాయలను కేజీ రూ.50 నుంచి రూ.120కు అమ్మకాలు జరుపుతున్నాయి. మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి చేసుకునే వెల్లుల్లికి కొరత రావడంతో ధర విపరీతంగా పెరిగిపోయింది. రెండు నెలలుగా నాణ్యతను బట్టి రూ.300 నుంచి



నిత్యావసరాలు



కూరగాయలు

రూ.400 వరకూ పలుకుతోంది. ఉప్పు నుంచి పప్పుల వరకూ రోజు రోజుకూ ధరలు పెరిగిపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. వీటితో పాటు మాంసాహారం ధర కూడా ఎక్కువైంది.

స్పందించని ప్రభుత్వం

మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర సుంకాల పెంపు వల్ల మూడు నెలల తర్వాతే వంటనూనెల ధర పెరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు రేట్లు పెంచి వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు అదుపులో ఉండేవి. ప్రకృతి వైపరీత్యాలు, సుంకాలు, దిగుబడి ప్రభావం వల్ల నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడల్లా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. రైతుబజార్లు, రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై వంటనూనెలు, పప్పుదినుసులు, ఉల్లిపాయలను ప్రజలకు అందజేసేవారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి మచ్చుకైనా కనిపించడం లేదు.

భయపెడుతున్న చిక్కుడు

అమలాపురం టౌన్: చిక్కుడు కాయలను రెండు రకాలుగా విక్రయాలు జరుపుతున్నారు. మొదటి రకంగా దేశవాళీ చిక్కుడును కిలో రూ.160కు, అలాగే హైదరాబాద్ నుంచి దిగుమతి అవుతున్న రెండో రకం చిక్కుడును రూ.120కు అమ్ముతున్నారు. జిల్లాలోని దాదాపు 650 కూరగాయల దుకాణాలకు సంబంధించి పెద్ద దుకాణాల్లో లోకల్, హైదరాబాద్ రెండు రకాల చిక్కుడును విక్రయానికి ఉంచుతున్నారు. వరదలు కారణంగా పంటలు నాశనమవ్వడంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

నిత్యావసరాలు	గతంలో ధర (రూ॥)	ప్రస్తుతం ధర (రూ॥)
సన్న బియ్యం (కేజీ)	58	72
కందిపప్పు	140	180
శనగపప్పు	85	105
మినపప్పు	120	150
పెసరపప్పు	125	155
సన్‌ఫ్లవర్	105	132
సోయాబీన్	102	125
పామాయిల్	94	115

కూరగాయలు (కేజీ)	హోల్‌సేల్ (రూ.లలో)	రిటైల్ (రూ.లలో)
ఉల్లి	45	70
మిరపకాయ	20	50
అల్లం	130	150
బంగాళదుంప	35	50
వంకాయ	50	60
బెండకాయ	30	60
బీట్ రూట్	30	50
కాలీఫ్లవర్	10	40
చిక్కుడుకాయ	80	120
అరటి కాయ	05	10
దొండకాయ	25	60
టమాటా	28	70
బీరకాయ	45	60
గోరుచిక్కుళ్లు	35	50
ఆనపకాయ	10	25
కాకరకాయ	45	60
కంద	42	50
పెండ్లం	35	50

ధరలను నియంత్రించాలి



పెరుగుతున్న ధరలను నియంత్రించకుండా ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబించడం సరికాదు. సత్వరమే స్పందించి రైతుబజార్లు, రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై సరకులను అందించి పేద ప్రజలను ఆదుకోవాలి.

– జి.దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, అమలాపురం.

ఇబ్బందులు పడుతున్నాం



నిత్యావసరాలు, కూరగాయల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అసలే వర్షాకాలం కావడంతో పనులు లేక సతమతమవుతున్నాం. ఈ తరుణంలో ధరల పెరుగుదల బెంబేలెత్తిస్తోంది.

– ఆర్.కుమారి, వెదురుమూడి, కపిలేశ్వరపురం మండలం

'నవోదయ' దరఖాస్తులకు 7 వరకూ గడువు



రామకృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 2025–26వ సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును పెంచారని విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తులకు అక్టోబర్ ఏడో వరకూ అవకాశం ఉందన్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలలోని 43 మండలాల్లో ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తి కలవారు అక్టోబర్ ఏడో తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 జనవరి 18న మూడు జిల్లాల్లోని సుమారు 45 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. నవోదయ డాట్ జీఓవిడాట్ఇన్‌వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో బిల్లు కలెక్టర్ మృతి



సూర్య మోహన్ (ఫైల్)

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా పంచాయతీ కార్యాలయానికి బయలుదేరిన బిల్లు కలెక్టర్ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయంలో పెండ్యాల సూర్య మోహన్ (27) బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అమలాపురం రూరల్ భట్నవిల్లిలోని తన ఇంటి నుంచి కార్యాలయానికి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. ఈ సమయంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. అతడిని వెంటనే బంధువులు అమలాపురం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మోహన్ మృతికి సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులు ఆర్.ఎస్.ఎస్.సూరపురాజు, కార్యదర్శి ఎం.రాంబాబు సంతాపం వ్యక్తం చేశారు.

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు

కొవ్వూరు: స్థానిక రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలోకి మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి దూకేశాడు. వంతెనపై 127 పిల్లర్ వద్ద తన మోటారుసైకిల్‌ను ఆపి నదిలోకి దూకినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నెంబర్ ప్లేట్ ఆధారంగా భీమవరంలోని మోటుపల్లివారి వీధిలోని కార్పెంటరీ వర్కర్ నాయుడు సుబ్రహ్మణ్యానికి చెందిన మోటారు సైకిల్‌గా గుర్తించారు. గల్లంతైన వ్యక్తి ఎవరనేది వివరాలు తెలియలేదు. అతడి ఆచూకీ కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

ఫుట్‌బాల్ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో బుధవారం జరగాల్సిన ఫుట్‌బాల్ అండర్–14 ఎంపికలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి మంగళవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన గేమ్స్ యథాతథంగా జరుగుతాయన్నారు.

వ్యాన్‌ను ఢీకొని ఇద్దరు యువకుల మృతి



ప్రమాదానికి కారణమైన వ్యాన్



యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్



వానపల్లి రాజేష్ (ఫైల్)



వేగిరాజు సీతారామరాజు (ఫైల్)

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిపై ఆలమూరు ఏటిగట్టు జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామానికి చెందిన వానపల్లి రాజేష్ (30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు (36) మోటారు సైకిల్‌పై రావులపాలెం వెళ్లి తిరిగి వస్తున్నారు. స్థానిక ఏటిగట్టు జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ముందుగా మత్స్యకారుల వలలతో వ్యాన్ వెళుతోంది. కపిలేశ్వరపురం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతున్న ఆ వ్యాన్‌ను వీరు బైక్‌తో బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై అశోక్ నేతృత్వంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మండపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల మృతితో విషాదఛాయలు

వానపల్లి రాజేష్, వేగిరాజు సీతారామరాజుల మృతితో వారి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. చొప్పెల్లకు చెందిన రాజేష్ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లిని, సోదరి పోషిస్తున్నాడు. ఇటీవలే సోదరికి వివాహం చేశాడు. తాను వచ్చే సంవత్సరం పెళ్లి చేసుకోవాలని భావించాడు. ఈలోపు మృత్యువు కబళించింది. దుళ్లకు చెందిన సీతారామరాజు వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య కోటేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇతడి తండ్రి డయాలసిస్ పేషెంట్. ఆ కుటుంబానికి సీతారామరాజే ఆధారం.

ప్రమాదకరంగా జంక్షన్

జాతీయ రహదారిలోని ఆలమూరు ఏటిగట్టు జంక్షన్‌లో గతంలో అనేక ప్రమాదాలు సంభవించాయి. వాటిని నివారణకు గడ్డర్లను అమర్చేందుకు వీలుగా కొన్ని రోజులు ఆ జంక్షన్‌ను మూసివేశారు. తదనంతరం ఇసుక ర్యాంపు వాహనాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఉద్దేశంతో ఆ జంక్షన్ రహదారిని పునరుద్ధరించారు. ఆ రెండు జాతీయ రహదారులను కలిపే ఆ జంక్షన్ మధ్యలో ఇటీవల చేపల మార్కెట్ విస్తరించింది. దీంతో వాహనచోదకులు తమ వాహనాలను అక్కడ ఆపి కొనుగోళ్లు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ మిగిలిన వాహనాలు నెమ్మదిగా ప్రయాణిస్తున్నారు. ఇదే క్రమంలో జంక్షన్ మధ్యలో వాహనాలు ఉండటం వల్ల వ్యాన్ నెమ్మదిగా వెళ్లడం, ఆ వెనుక బైక్‌తో వచ్చిన యువకులు ఢీకొని ప్రాణాలు పోగొట్టుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

కడియం నర్సరీ ప్రాంతానికి చిరుత



కడియం దోసాలమ్మ కాలనీ సమీపంలో చిరుతపులి పాదముద్రలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న దివాన్ చెరువు ఫారెస్టు డీఆర్‌వో పద్మావతి

రాజమహేంద్రవరం రూరల్/కడియం: దివాన్ చెరువు అభయారణ్యంలో సంచరించిన చిరుత పులి కడియం నర్సరీ ప్రాంతానికి చేరినట్టు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. కడియం - వీరవరం రోడ్డు మధ్యలోని దోసాలమ్మ కాలనీలో చిరుత జాడలు కనిపించాయి. దీంతో కాలనీ వాసులందరూ భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న దివాన్ చెరువు ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మావతి, రేంజర్ శ్రీనివాస్, స్క్వాడ్ డీఆర్‌వో రాజా అండ్ టీమ్, రేంజ్ పరిధిలోని సిబ్బంది ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. అవి చిరుత పాదముద్రలే అని గుర్తించారు. అయితే అది ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందనే విషయం అంతుపట్టడం లేదు. కొన్ని నర్సరీలలో సీసీ కెమెరాలు ఉంటాయి. పులి భయంతో నర్సరీల్లో రైతులెవ్వరూ ఉండడం లేదు. చిరుత ఈ ప్రాంతంలోనే ఉందా, ఎక్కడికైనా వెళ్లిందా అన్న విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. పులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు, కూలీలకు బుధవారం నర్సరీలకు వెళ్లవద్దని సూచించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



చిట్టివేణి మృతదేహం, వివరాలు సేకరిస్తున్న ఎస్సై శాస్త్రి

మండపేట: పట్టణంలో ఓ వివాహిత మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఏడిద రోడ్డులోని పోలేరమ్మ ఆలయం సమీపంలో పిల్లి సూర్యావతి, సత్యనారాయణ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె చిట్టివేణి (33)కి విజయవాడకు చెందిన దిరిసాల ప్రభుకుమార్‌తో 2021 డిసెంబర్‌లో వివాహమైంది. కొన్నాళ్లకు వీరిద్దరి మధ్య కలహాలు రావడంతో చిట్టివేణి 18 నెలలుగా మండపేటలోని పుట్టింటిలోనే తల్లి వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సూర్యావతి పెడపర్తిలోని గ్రామ దేవత దర్శనానికి వెళ్లింది. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి తలుపు తీసి చూసేసరికీ రేకుల షెడ్డులో ఇనుప గడ్డర్‌కు చిట్టివేణి చున్నీతో ఉరివేసుకుని ఉంది. విషయం తెలుసుకున్న ఎస్సై హరికోటి శాస్త్రి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిడదవోలులో తాపీమేస్త్రి

నిడదవోలు: రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేయార్డ్ డౌన్ లైన్ ట్రాక్ వద్ద దడాల సురేష్ (42) అనే తాపీమేస్త్రి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసముంటే సతీష్ కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇందిరా నగర్‌లో రైలు పట్టాల వద్దకు చేరుకున్నాడు. అక్కడ విశాఖపట్నం వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఎనిమిది నెలల క్రితం ఉపాధి కోసం కువైట్ వెళ్లారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే హెచ్‌సీ డి.శ్రీనివాసరావు తెలిపారు.

మహిళపై దాడి చేసిన ఐదుగురికి జైలు

రాజోలు: మహిళను అగౌరవపరిచి, దాడి చేసిన ఐదుగురికి ఏడాది జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు మంగళవారం తీర్పు చెప్పారు. ఎస్సై రాజేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి దుర్గాకాశేశ్వరిపై 2019 మార్చి ఆరున అదే గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావు, చింతా దుర్గ, చింతా కిరణ్, పొన్నమండ విజయలక్ష్మి, పొన్నమండ శ్రీను దాడి చేశారు. డ్రైనేజీ విషయంలో వీరికి గొడవ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రాజోలు ఎస్సై ఎం.నాగరాజు కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులపై పైవిధంగా శిక్ష విధించారు. ఈ కేసులో బాధితురాలి తరపున ఏపీపీ ఎస్.ఆనంద్ వాదించారు. సరైన సాక్షులను ప్రవేశపెట్టి ముద్దాయిలకు శిక్ష పడేలా సహకరించిన ఏపీపీ ఆనంద్, కోర్టు కానిస్టేబుల్ అలీని సీఐ నరేష్ కుమార్ అభినందించారు.

తాచుపాము హల్‌చల్



పామును సీసాలో బంధించిన స్నేక్ క్యాచర్ వర్మ

తాళ్లరేవు: పిల్లంక గ్రామంలో మూడు రోజులుగా తాచుపాము హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) ఇంటి పెరట్లో మూడు రోజులుగా సంచరించింది. కొబ్బరికాయల గుట్టలోకి వెళ్లి ఎంతకూ బయటకు రాకపోవడంతో కాశిబాబు స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన మంగళవారం వచ్చి చాకచక్యంగా తాచుపామును పట్టుకుని సీసాలో బంధించారు. తాచుపాము సుమారు ఐదు అడుగుల పొడవు ఉందని, సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందన్నారు.

పిఠాపురం కూటమిలో కుమ్ములాట

కొట్టుకుని కేసులు పెట్టుకున్న జనసేన, టీడీపీ వర్గాలు

పిఠాపురం: పిఠాపురంలో టీడీపీ, జనసేన మధ్య ఆధిపత్య పోరు మరోసారి భగ్గుమంది. రెండు పార్టీలకు చెందిన నాయకులు వీధి రౌడీల్లా ఒకరిపై ఒకరు దాడి చేసుకుని పరస్పరం కేసులు పెట్టుకున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గృహనిర్మాణ రుణాల సర్వేలో టీడీపీ నేతలు జనసేనతో సంబంధం లేకుండా పెత్తనం చెలాయించడంపై జనసేన నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. మాకు సమాచారం ఇవ్వకుండా, మాతో సంబంధం లేకుండా మీరు చేయడమేమిటని టీడీపీ నేతలను జనసేన నేతలు ప్రశ్నించడంతో మీకు చెప్పాల్సిన పనిలేదంటూ టీడీపీ నేతలు తిరగబడడంతో ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. ఈ నేపథ్యంలో రెండు వర్గాలకు చెందిన వారికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఆస్పత్రులలో చేరి పోలీసు స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. స్టేట్‌మెంట్లు తీసుకున్నామని, కేసులు నమోదు చేయలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉంటే ఆస్పత్రిలో ఉన్న జనసేన కార్యకర్తలను పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పరామర్శిస్తే మరో ఆస్పత్రిలో ఉన్న టీడీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఎవరి వర్గాలను వారు విడివిడిగా పరామర్శించారు.

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్–19 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీల్లో గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ విషయాన్ని హెచ్ఎం జి.శ్రీహరి రాజశేఖర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. విజయవాడలోని పడమట స్టేడియంలో ఈ నెల 20, 21 తేదీలలో అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి మట్టపర్తి గ్రీష్మశ్రీ, ఇల్ల మనోజ్ఞ నాగదీప్తి, దంగేటి విద్యాసాయిశ్రీ కాంస్య పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు పొందారన్నారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను, పీడీ ఆసు శేష వెంకట సూర్యమధులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, విత్తనాల ఇంద్రశేఖర్, పీఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందరావు, బందన రాంబాబు, మట్టపర్తి చంద్రశేఖర్ అభినందించారన్నారు.